వేపచెట్టూ వెంకటలక్ష్మీ

జి ఎన్. సూరి

అమలాపురంనుంచి భీవుడు ఉత్తరం రాశాడు. రెండే రెండు ముక్క లున్నాయి కాగితంలో—

సూరీ!

మీ దొడ్లో వేపచెట్టు కొట్టేస్తున్నారు. అది కాస్తా కొట్టేస్తే ఏటా ఉగాదికి వేప పూవు గురించి మీ ఇంటికొచ్చే ఆడపిల్లలు ఎవరూ మీ ఇంటికి రారు. నీ ఊహా సుందరి అన్వేషణకు ఆపైన తీవ్రంగా ఆటంకం కలుగుతుంది. వచ్చి రక్షించుకో!

స్నేహితుడు,
భీవుడు.

ఉత్తరం చూసుకున్న సూర్యం గొల్లు మన్నాడు. (గుండెలు బాదుకుని!)సూర్యం

గుండెలు బాదుకుంటున్న శబ్దం విన్న అతని జతగాడు బాబురావు అంతవరకూ పేపర్లో దాచుకున్న మొహాన్ని పైకెత్తి-

"హు! నువ్వీ ప్రేమలేఖలు రాయటం మానవ్ అవి తిరిగొస్తే ఏడవటం అంతకన్నా మానవ్!" అన్నాడు చికాగ్గా చూస్తూ.

సూర్యం గుండెలు బాదుకోవటం మాని కోపంగా చూశాడు. దాంతో కాస్త జంకాడు బాబురావు-"అవును మరి కనపడిన ప్రతీ ఆడపిల్లనూ ప్రేమించాననుకోవటం తప్పుకదూ?" అన్నాడు నెమ్మదిగా.

గుండెలు బాదుకోవటంతోబాటు ఏడుపు కూడా మాని మరింత కోపంగా చూశాడు సూర్యం.

బాబురావు మౌనం వహించాడు భయపడి కొన్ని సెకన్లసేపు ఆ ఇద్దరి మధ్య మౌనం విచ్చలవిడిగా రాజ్యం చేసింది కాసేపున్నాక బాబురావే-"ఇంతకీ ఏమిటా ఉత్తరం? పార్వతికి రాసిందేనా?—" అన్నాడు ఆప్యాయంగా చూస్తూ

కాదన్నట్లు తలూపాడు సూర్యం.

"మరి? మెడికో లలితా? ... లేకపోతే ఫస్ట్ బి ఏ పద్మా? "

సూర్యం జవాబు చెప్పలేదు.

"కొంపతీసి శ్యామల కాదు కదా?"

సూర్యం రక్కున మొహం పైకెత్తి-"వాళ్ళందరూ ఇదివరకే అయిపోయారు. అయినా ఇది వేరే విషయం మా భీవుడు ఉత్తరం రాశాడు." అంటూ ఉత్తరం బాబురావుమీదకు గిరాటేశాడు.

తెల్లబోయి చూశాడు బాబురావు సూర్యంవైపు ఉత్తరం అందుకుంటూ.

ఉత్తరం చదవటం ముగించి ఆశ్చర్యంగా మొహంపెట్టి-

"హారినీ! లోకల్‌గానే అనుకున్నాను. అదర్ స్టేషన్లలలో కూడా సాగిస్తున్నావన్నమాట నీ కార్యక్రమం? అఘాంతకుడు వస్మీ!" అన్నాడు.

సిగ్గుపడుతూ నవ్వాడు సూర్యం ఆ ప్రశంసకు.

"నాకిప్పుడుతెల్సింది అసలు కారణం!" అన్నాడు బాబురావు గోడకు జేర్లబడి కూర్చుంటూ.

ఏమిటన్నట్లు చూశాడు సూర్యం.

"అదే గత రెండేళ్లుగా పరీక్షల్లో నువ్వెందుకు డింకీలు కొడ్తున్నావో!" వెటకారంగా అన్నాడు బాబురావు.

నడ్డిమీద ఛెళ్లున చరిచినట్లయ్యింది సూర్యానికి. గుర్రుగా చూశాడు. కొడ్తాడేమోనని అనుమానం వచ్చింది బాబురావుకు. అందుకని మాట మారుస్తూ—"అదిసర్లేకాని అబ్బీ! ఇంతకీ వేసచెట్టు గొడవేమిట్రా?" అన్నాడు.

"నేను చెప్పను!" బింకం చూపించాడు సూర్యం.

"అయినా నీ కెందుకూ నా గొడవ? ఆనక వెక్కిరించటానికా?" అని కూడా అన్నాడు

బాబురావుకి నవ్వొచ్చింది సూర్యాన్ని చూస్తుంటే.

అలిగిన చంటిపిల్లాడిలా ఉన్నాడా సమయంలో.

అసలు అందుకనే బాబురావుకి సూర్యం అంటే పుట్టెడభిమానం. అతగాడి మనస్తత్వం వరి పసిపిల్లాడి తీరుదని బాబు

రావుకి బాగా తెల్సు.

అందుకనే ఓ నిముషంసేపు ఆగి—

"అయితే బుజ్జీ అసలు విషయం తెలియకుండా నీకు నేనెలా సలహాలివ్వ గల[నా]!" అన్నాడు బుజ్జగింపుగా.

అవునా అన్నట్లు చూశాడు సూర్యం స్నేహితుడివైపు

"అవున్రా నానిగా! ఈ ఉగాదికి నువ్వు ప్రేమించిన అమ్మాయిని నీకిచ్చి కట్టబెట్టాలని నా సంకల్పం ఊఁ! ఒట్టు"

సూర్యం చేతిలో చేయివేసి పైగా అరచేతిలోగిల్లి మరీ చెప్పాడు బాబురావు.

సూర్యానికి స్నేహితుడి మాటలపై కాస్త నమ్మకం తోచింది అప్పటికి.

"చెప్పరా అబ్బీ!" అన్నాడు బాబురావు.

"మా ఇంట్లో ఓ వేపచెట్టు ఉంది " అంటూ మొదలెట్టాడు సూర్యం.

"దాన్నిప్పుడు కొట్టేస్తున్నారు అది కూడా తెల్సు! ఓరేయ్ పిచ్చికన్నా! వేపచెట్టు ప్రతీవాళ్లింట్లోనూ ఉంటుంది. అదేమంత వింతైన విషయంకాదు. కాకపోతే మీ ఇంట్లో వేపచెట్టు ప్రత్యేకత ఏమిటో కాస్త వివరంగా చెప్పి అఘోరించు! లేకపోతే సలహాలివ్వటం చాలా కష్టం" అన్నాడు జతగాడి మాటలకు మధ్యలో అడ్డొస్తూ.

బాబురావు ఫోజుకి వళ్లు మండింది సూర్యానికి.

"బోడిఫోజూ బోడి సలహాలూనూ" అని తిట్టాడు మనసులోనే. కాని పైకి మాత్రం - "ఆదే అఘోరిస్తున్నాను

కాస్త నువ్వు అడ్డు తగలకుండా ఏడిస్తే అంతా చెప్దామని నా అభిలాష" అన్నాడు సౌమ్యాన్ని మాటల్లోకి ఎరువుతెచ్చుకుంటూ.

అంతే బాబురావు కిమ్మనలేదు.

సూర్యం చెప్పటం సాగించాడు.

"వేపచెట్టు అందరిళ్లల్లోనూ ఉంటుందనేగా నువ్వనేది కాని మావూళ్ళో మాత్రం మావీధికి నాలుగైదు వీధుల ఆటూ ఇటూ ఆపేరుగల చెట్టు ఏదీలేదని నాకు తెల్సు-అదీ ఖచ్చితంగా. అందుకనే మా ఇంటి వేపచెట్టు కంత ప్రత్యేకత.

ఉగాది వచ్చిందంటే చాలు వూళ్లో ఆడామగా అంతా మా ఇంట్లోనే ఉంటారు. ఎందుకో తెల్సా?...ఉగాది పచ్చడిలోకి వేపపువ్వు వేస్తారుకదా? అది కోసుకోటానికి.

అందుకోసం వచ్చిన మగాళ్ళని నేనంతగా ఎప్పుడూ పట్టించుకుని ఎరగను కాని .. ఆడపిల్లల్ని మాత్రం కాస్త పరిశీలనగానే చూసేవాణ్ణి. ఎందుకంటే నా జీవిత

భాగస్వామినీ - నా ఊహాసుందరీ వాళ్ళల్లో ఉండిఉంటుందేమోనని.

ఒక్క ముక్కలో చెప్పాలంటే నా వైపునుంచి పెళ్ళిచూపులు మా వేపచెట్టు క్రిందే సాగుతాయి ప్రతీ ఉగాదికి. సుమారు నాలుగైదు యేళ్లగా వ్యవహారం సాగుతోంది. ఇప్పుడు ఇప్పుడు ఇలా హఠాత్తుగా ఆ చెట్టుకొట్టేస్తే నా ఊహాసుందరిని వెదకటం ఎలా?

ఎలా? ?'' సూర్యానికి మళ్ళీ ఏడుపు ముంచుకు వచ్చింది. జతగాడు చెప్తోన్నదంతా అప్పటివరకూ నుదురు చిట్లిస్తూ ఓపిగ్గా విన్న బాబురావు లోపలే- 'ఏడవలేకపోయావ్!' అనుకున్నాడు .. ఏడుస్తోన్న సూర్యాన్ని చూస్తూ.

బాబురావ్ ఎప్పటికీ ఓదార్చకపోవటంతో తనంతటతానే ఊరుకున్నాడు—సూర్యం.

ఇంతా సూర్యం ఊరుకున్నాక-"ఊరుకోరా?'' అన్నాడు బాబురావు.

తన తొందరపాటుకి నాలిక్కరుచుకున్నాడు సూర్యం.

ఆ తర్వాత ఇద్దరికీ ఏం మాట్లాడాలో తోచలేదు కాసేపు. సూర్యం పైకప్పుకేసీ-బాబురావు పేపర్లోకిచూస్తూ కాలంగడిపారు.

చివరకు సూర్యమే అన్నాడు - ''మా వేపచెట్టు కొట్టేస్తున్నారట!'' అన్నాడు ఏం మాట్లాడాలో తోచక.

''ఆ విషయం గురించే ఇంతవరకూ మాట్లాడుకున్నాం!'' అన్నాడు బాబురావు విసుగ్గా.

సూర్యం బాబురావు విసుగుని గుర్తించవట్లు—

''వేపచెట్టు కొట్టకుండా ఆపాలి .. అర్జంట్‌గా ఊరెళ్లాలి!'' అన్నాడు అరచేతిలో రేఖలు చూసుకుంటూ.

''నేనుచస్తే కానీ ఇవ్వను. .నా దగ్గరేం డబ్బులు లేవు'' అన్నాడు బాబురావు.

''డబ్బులున్నాయి " నసిగాడు సూర్యం.

''నా బట్టలు పట్టుకెళ్ళటానికి అసలు ఒప్పుకోను నాక్కావాలి!'' నిర్మొహమాటంగా అనేశాడు బాబురావు.

''ప్రేమ పనిమీద వెళ్తున్నాను అయిపోగనే ఇట్టే తిరిగొచ్చేస్తాను.'' అన్నాడు సూర్యం ఏదో ఆఫీసుపని అన్నట్టుగా

''నీకంతకన్నా పనేం ఉందికనుకనా వేరే?'' అని ''ఓరేయ్ సూరిగా! శ్రద్ధగా చదువుకోక...ప్రేమా గీమా ఏమిటి చెప్పు? అయినా నిన్నూ నన్నూ చూసి చూసి ఏ ఆడపిల్ల ప్రేమిస్తుంది చెప్పు?'' అన్నాడు అమనయంగా.

సూర్యం జవాబు చెప్పలేదు స్నేహితుడి దగ్గర పేంట్లు ఎరువు తీసికెళ్లే ఉపాయం ఆలోచిస్తున్నాడు తీవ్రంగా.

బాబురావే అన్నాడు మళ్లీ - ''నాకు తెలియ కడుగుతాను కాని సూరిగా! రోజు కెంతమందిని లౌ చేస్తావురా? అదీ బొత్తిగా వన్‌వే ట్రాఫిక్కు. నీ పద్ధతేం నాకు నచ్చలేదస్మీ!'' మందలింపుగా.

''అందుకనే అందుకనే మరి - మా వేపచెట్టు కొట్టెయ్యకుండా ఈ ఉగాదికేనా ఎవర్నో ఒకర్ని నిశ్చయం చేసుకుందామని

అర్థంతరంగా ఇప్పుడు పేంట్లు పట్టుకెళ్లొద్దంటే ఎలారా? నలపకుండా తీసు



కొచ్చేస్తాగా'' ఆర్థిపుగా అడిగాడు.

''ఉహుఁ! నూర్రోజుల పండుగ అయితేనేకాని నువ్వు బనీనుకూడా విప్పవ్. అదినాకు బాగా తెల్సు. పోతే—నాలు గేళ్లగా దొరకని ఊహాసుందరి ఈ ఉగాదికి మాత్రం కనపడుతుందని నమ్మకం ఏమిటి? లాభంలేదు! అదీకాక సూరి బాబూ! నీ ఊహాసుందరి ఎలా ఉంటుందో కాస్త చెప్పి అఘోరించు. అస లలాంటిపిల్ల ఈ భూమ్మీద ఉంటుందో ఉండదో చెప్తాను'' అన్నాడు బాబురావు,

''నాకు తెలీదు బాబూ!'' అన్నాడు కాసేపు ఆలోచించి ఏం చెప్పాలో-ఏమని చెప్పాలో తోచని సూర్యం.

వింతగా చూశాడు బాబురావు-''అఘొ రించినట్లే ఉంది నీ బోడి ఊహ! ...అసలు ఊహంటూలేని వెఱ్ఱివెధవ్వు నీకు సుందరి ఎక్కణుంచి వస్తుందిరా సూరీ.'' అన్నాడు హేళనగా.

సూర్యం సిగ్గుపడి పోయాడు జతగాడి మాటలకు.

''ఏమో బాబూ! అదేం నాకు తెలి యదు. నాకు మాత్రం ఓ అమ్మాయిని ప్రేమించాలనుంది. ఏమైనాసరే!'' అన్నాడు కృతనిశ్చయుడై ఉన్నట్లు.

''దాన్ని ప్రేమ అనరు. పిచ్చిఅంటారు. అది మోతాదు మించితే ప్రమాదం జాగ్రత్త!'' అని హెచ్చరించాడు బాబు రావు.

సూర్యం బిక్కమొహం వేశాడు.

బాబురావుకి జాలేసింది అతన్నిచూస్తే.

''పోనీ సూరీ! నాలుగేళ్ళ వేపచెట్టు కింద అన్వేషణలో ఎవరెవర్ని చూశావో వాళ్ళకి నీమీద ఎలాంటి అభిప్రాయం ఉందో చెప్తావా?''

''పంతులుగారి సావిత్రినీ. జగన్నాథం

గారి కామాక్షినీ. ప్రెసిడెంటుగారి వర్ధన్ని చాలామందినే చూశాను. వాళ్ళందరికీ నేను చాలా మంచివాణ్ణని అభిప్రాయం'' గర్వంగా బదులు చెప్పాడు సూర్యం

మొహం ఇంత చేసుకుని చూశాడు బాబురావు.

''హారినీ సిగరెట్లు తాగి చీట్లపేకాట ఆడే నువ్వు బుద్ధిమంతుడివి ఎలా అయ్యావురా? నిజంగా ఆశ్చర్యంగానే ఉందస్మీ ''

"మా ఊరెడితే అవేం చేయనుతెల్సా? పైగా కాఫీకూడా తాగను.''

''దుర్మార్గుడా! ఈ విధంగా మోసం చేస్తున్నావన్నమాట మీఊరి ఆడపిల్లల్ని. విజం తెలిస్తే చావతంతార్రోయ్! జాగ్రత్త మరి'' అన్నాడు బాబురావు.

తంతే తన్ననీ అన్నట్లు నిర్లక్ష్యంగా నవ్వాడు సూర్యం.

రెండు క్షణాలు మౌనవ్రతం సాగించారిద్దరూ. ఆ తర్వాత బాబురావు- ''ఒరేయ్ సూరీ! నీ అన్వేషణకి అంతం ఎప్పుడ్రా? ఇందరికి మనసివ్వటానికి నీకెన్నిగుండెల్రా? అబ్బీ?'' అనడిగాడు.

''అదేవద్దన్నది ఇంకా ఎవరికీ మనసివ్వలేదని చెప్పానా! అందరూ నచ్చినట్లే కనబడతారు అందరూ నేనంటే ఇష్టపడుతున్నట్లుగానే కనపడతారు - ఎలా చావటం? ఫస్ట్ బి. ఏ పద్మనే ఎంచుకోనా? ప్రెసిడెంటుగారి వర్ధన్ని వరించనా? సావిత్రినా, శ్యామలనా, కామాక్షినా, కాత్యాయినా? ఎవర్ని? ఎవర్ని?''

మిత్రుడి వ్యధ బాబురావు హృదయాన్ని కదిల్చేసింది ఎలాగైనా అతని ఊహాసుందరి అన్వేషణకి ఒకమార్గం చూపించాలనుకున్నాడు.

ఉత్తరక్షణాన్న మెల్లగా ఊపిరి పీల్చి-వదలి,"సూరీ! నువ్వొరి అమాయకుడివిరా! ఆడపిల్లల సైకాలజీ బొత్తిగా తెలియదస్మీ నీకు'' అన్నాడు.

''సైకాలజీయా?'' ఆశ్చర్యంగా అన్నాడు సూర్యం, ''ఆ! సైకాలజీయే అదేమిటంటే. నిన్ను ప్రేమిస్తోన్నట్లు కనపడే ఆడపిల్లకు నీమీద మనసుండటం అబద్ధం నువ్వంటే మండిపడే మగువకి నీమీద తగని మక్కువ. అదీ సంగతి. తెల్సిందా? - ఈ ఫార్ములాతో నీ ఊహాసుందరి అన్వేషణ సాగించు వెళ్ళు! కాని ఒకమాట! నా పేంట్లు మాత్రం తీసికెళ్ళకు'' అన్నాడు బారెడు ఉపన్యాసం దంచి.

''ఏడిసినట్లుంది నీ బోడి సైకాలజీనూ నీబోడి సలహానూ'' విసుక్కున్నాడు సూర్యం

''ఏం?'' అన్నాడు బాబూరావు అతి మామూలుగా. ''ఏమిటా? నీబోడి సైకాలజీ ప్రకారం చూస్తే మా కరణంగారి వెంకటలక్ష్మికి నేనంటే తగని మక్కువైయ్యుండాలి అది కల్లోమాట! ఎందుకంటావేమో? ఈ దేశం మొత్తంమీద నన్ను విపరీతంగా ద్వేషించేదీ - దుమ్మెత్తిపోసేది ఒక్క వెంకటలక్ష్మి మాత్రమే ''

ఆ మాటలు వింటూ ఎగిరిగంతేసేడు బాబురావు. ''సో! మైఫోర్ కేస్తు ఈజ్ క్వయిట్ కరెక్ట్, నా అంచనాయే నిజమైతే ఆ అమ్మాయే ని ఊహాసుందరి. ఈ భూప్రపంచంలో నిన్ను ప్రేమించే ఒక్కగానొక్క ఆడకూతురు - కావలిస్తే బెట్ చేయి.'' రెచ్చిపోయాడు బాబురావు

సూర్యానికి వళ్ళుమండింది బాబురావు మాటలకి.

"ఓకే! అదీ చూద్దాం. అయితే ఈ మాటుకి నీ పేంట్లు పట్టికెళ్ళనీ. నువ్వు నెగ్గావో వచ్చేసారినుంచి పేంట్లు అడగను అలాకాకపోతే "

బాబురావుకి మతి పోయిందీమాటు.

సంభాషణ ఎటుమళ్ళించి ఎటు తీసు కొచ్చినా పేంట్లు మీదకు లాక్కొచ్చే జత గాడి నేర్పరితనానికి విస్తుపోయాడు చివ రకు ఒక నిర్ణయానికి వచ్చాడు ఎలాగైనా తను నెగ్గటం ఖాయం. ఈ ఒక్కమాటుకే పేంట్లు వాడి మొఖాన తగలేస్తే ఆపైన ఎలాగూ ఇవ్వక్కర్లేదూ

ఆ ధైర్యంతో - "సరే ' అన్నాడు బాబురావు వెంరనే సూర్యం దండెంమీద బాబురావు పేంట్లుతీసి సూటుకేసులో కుక్కేశాడు. బాబురావు మొహం అటు తిప్పుకున్నాడు.

మంచంకింద బూట్లుతీసి తొడు క్కుంటూ.

"మరి వెళ్ళిరానా?" అన్నాడు

"మంచిది పేంట్లుమాత్రం మాయ గానే విప్పేస్తూ ఉండు" అన్నాడు బాబు రావు.

సూర్యం వినిపించుకోలేదామాట.

మరుక్షణంలోనే తన ఊరువెళ్ళే రైల్లో ఎక్కి కూర్చున్నాడు సూర్యం

* * *

ఊళ్ళో దిగుతూండగానే భీవుణ్ణి కౌశిక గట్టుకి తీ కొని పోయాడు సూర్యం

"ఊఁ ఇప్పుడు వివరంగా అన్నీ చెప్పు. అసలు వేపచెట్టు ఎందుకు కొట్టే శారు? ఏమిటీ-" అన్నాడు అక్కడ కూర్చోబెట్టి.

భీవుడు శాంతంగా చుట్టపొగ గుండెల కంట పీల్చి వదిలాడు.

సూర్యానికి కడుపులో దేవినట్లయ్యింది. అయినా భరించాడు.

భీవుడు ఏం చెప్తాడోనని చెవులు రిక్కించి వింటున్నాడు సూర్యం

"వెంకటలక్ష్మి కొట్టేయ్యించింది!" అన్నాడు.

ఉలిక్కిపడ్డాడు సూర్యం.

"ఏ వెంకటలక్ష్మి?"

భీవుడు చుట్టపొగ తన్మయత్వంలోంచి ఇవతలకు రాకుండానే.

"కరణంగారి వెంకటలక్ష్మి!" అన్నాడు

సూర్యానికి ఉక్రోషం ముంచుకొచ్చింది వెంకటలక్ష్మి పేరు వింటూండగానే - "ఎందుకట? అసలెందుకట?" అన్నాడు ఓమూల ఏడుపు ముంచుకొస్తూంటే

భీవుడు జాలిగా చూశాడు స్నేహితుడి వైపు

"మీ వేపచెట్టుమీద దయ్యం ఉందట అందుకూ ' అన్నాడు మళ్ళీ చుట్ట నోట్లో పెట్టేసుకుంటూ

సూర్యం విస్తుపోయాడు ఆ మాటలకు,

"దయ్యమా? ఎవరు చెప్పారూ?"

' వెంకటలక్ష్మే! దాన్ని రెండుమూడు సార్లు బరికించట చెట్టు కిందకెడితే - ఆపైన మొన్న నొకమాటు నెత్తికేక వేసి ఆ వేప చెట్టుకింద పడిందో లేదో కూడాను అంతే! వేపచెట్టుమీద దయ్యం చేరిందనీ వూళ్ళో

ఆడపిల్ల అందరిమీద వాలుతోందని అందరూ గోలపెడితే కొట్టేయించారు మీవాళ్లు—అదీ కథ!'

సూర్యానికిదేం అర్థం కాలేదు. ఎక్కణ్ణుంచి వచ్చిందీ పాడుదెయ్యం? ఎప్పుడు వచ్చింది? ఎంతాలోచించినా సమాధానం దొరకలేదు.

బీపుడు మట్టయిపోయింది.

ఆపైన ఒక్కక్షణంకూడా కూర్చోడని సూర్యానికి తెల్సు.

అందుకనే లేచాడు ఇంటికెళ్ళటానికి.

* * *

ఆ సాయంకాలం సూర్యానికి శివాలయం దగ్గర కామాక్షి కనపడింది.

ఎప్పటిలాగే కామాక్షి తను కనపడగానే చిరునవ్వు నవ్వకపోవటం ఆశ్చర్యమనిపించింది సూర్యానికి. పైగా మూతి మూకు వంకర్లు తిప్పి వెళ్ళిపోవటం మరీ వింతగా కనపడింది.

ఏమిటీ మార్పు? ఎందుకీ మార్పు అనుకున్నాడు.

ఆ తర్వాత కనపడిన వర్ధనీ అంతే—మొహం అటుతిప్పేసుకుంది సూర్యం కనపడగానే.

డీలా అయిపోయాడు సూర్యం దాంతో.

'వీళ్ళంతా స్ట్రైక్ చేసినట్లూ-కూడబలుక్కున్నట్లు ఏమిటబ్బా ఇది? కొంపతీసి పట్నంలో తను సిగరెట్లు కాలుస్తాననీ-చీట్లపేక ఆడతాననీ పైగా కాఫీకూడా తాగుతాననీ తెల్సిపోయి ఇలా చేస్తున్నారా? ఆc! అవన్నీ వీళ్ళకెలా తెలుస్తాయి?—అయితే వీళ్ళ మనసు హఠాత్తుగా ఇలా విరిగిపోటానికి కారణం?'' సూర్యం బుర్ర వేడెక్కటమే జరిగిందంతే.

ఇలా కాదనుకుని ఆ మర్నాడుదయమే చెరువు దగ్గర కెళ్ళాడు. సావిత్రి చంకన బిందెపట్టుకుని వచ్చింది నీళ్ళకు. సూర్యాన్ని చూసి రక్కున అంతదూరంలోనే ఆగిపోయింది. అనక ఈసడింపుగా చూసింది.

లాభం లేదనుకున్నాడు సూర్యం. ధైర్యం తెచ్చుకుని ''ఏమిటి సావిత్రీ? ఎందుకలా ఆగిపోయావ్? మీరంతా నామీద కట్టుకట్టినట్లు ఎందుకు ఇలా మాట్లాడటం లేదూ? అన్నాడు.

'రౌడీలతోనూ రాలుగాయలతోనూ మర్యాదున్న ఏ ఆడపిల్లాకూడా మాట్లాడదు-తెల్సా? పట్నంలో నీ పోకిరి వేషాలు మాకెవరికీ తెలియకుండా అల్లాగే ఉంటాయనుకున్నావా? ఎప్పటికీ! అంది స్కాట్లాండ్ యార్డ్ పోలీసులా.

'అది! అది? అవి? మీకెవరు చెప్పారు?

నీరుగారిపోతూ అడిగాడు.

ఇంకెవరూ? కరణంగారి వెంకటలక్ష్మి ఇవన్నీ చెప్పి మా కళ్లు తెరిపించింది—హుఁ! అంటూ బుడుంగున చెరువులో బిందె ముంచి చంకన పెట్టుకొని విస విస నడుస్తూ వెళ్ళిపోయింది సావిత్రి.

సూర్యం నివ్వెరపోతూ చూస్తూ ఉండిపోయాడు.

* * *

''వేపచెట్టు కొట్టేయ్యించింది?''

''ఊళ్లో ఆడపిల్లల్ని తనతో మాట్లాడకుండా చేసింది?

''ఎందుకు? ఎందుకు? వెంకటలక్ష్మి ఇవన్నీ చేస్తోంది? తనమీద ఎందుకిలా

కక్ష సాధిస్తోంది! తనేం అపకారం చేశాడు వెంకటలక్ష్మికి?

వాళ్ళింట్లో వీధి గదిలో మడత మంచం పట్టి బెంగపెట్టుకో సాగాడు సూర్యం.

"అయినా పట్నంలో తన వ్యవహారాలు ఈవిడగారికి ఎలా తెలిశాయి?-" అంటూ సందేహ పడ్డాడు కూడా.

సూర్యం ఈ ఆలోచనలో ఉండగా-

"అత్తయ్యగారూ! మా అమ్మ మీకి పంచదార ఇచ్చిరమ్మంది" అంటూ వెంకటలక్ష్మి కంఠం వినపడింది.

"రామ్మా వెంకటలక్ష్మీ రా! ఆఁ మీ అమ్మగారి చాదస్తంకాని ఇంతోటి పంచదార తిరిగివ్వాలేమిటే?" అమ్మ కంఠం-ఆపైన పంచదార డబ్బాలో పోస్తున్న చప్పుడు.

కాసేపు నిశ్శబ్దం.

'ఇలా ఇవ్వండి అత్తయ్యగారూ! అరటికాయలు నేను తరిగిపెడ్తాను-" అంటోంది వెంకటలక్ష్మి.

'చస్తే ఆ కూర నేను ముట్టుకోను-' కోపంగా మనసులోనే అనుకున్నాడు సూర్యం.

"మా అమ్మే మా తల్లే! ఆడపిల్లలంటే అలా ఉండాలి-ఏ ఇంటి కోడలవుతవో కాని-' అమ్మ పొగడ్త.

"సూర్యం వచ్చాట్టా కదండి అత్తయ్యగారూ?- అరటికాయ తరుగుతూ అడుగుతోంది వెంకటలక్ష్మి.

"ఆఁ వచ్చాడమ్మా-నిన్ననే! ఏం నీకు కనపడలేదూ? వీధిలో- ' అడిగింది తల్లి.

ఏం చెప్తుందోనని చెవులు రిక్కించాడు.

"లేదత్తయ్యగారూ! అయినా మీ సూర్యానికి నేనంటే అస్సలు కిట్టదు పలకరిస్తేనే చాలు మండిపడతాడు. బియ్యం కడిగితేనాండీ అత్తయ్యగారూ?

"వాడి తీరే అంతమ్మ ఎప్పుడెలా ఉంటాడో వాడికే తెలీదు -అయినా నీకెందుకమ్మా వెంకటలక్ష్మీ ఈ శ్రమంతా సరే! బావిదగ్గరకు వెళ్ళక్కర్లేదు కాని, వరండాలో బకెట్టూ నీళ్ళూ ఉన్నాయి అక్కడ కడుక్కునిరా! వెంకటలక్ష్మి అంతులేని కాకానీ-వద్దు వద్దు అంటూనే వెంకటలక్ష్మిచేత అవనీ-ఈవనీ చేయించుకుంటున్న తల్లి తెలివి తేటల్ని తూకం వేస్తూ తెల్లబోయాడు సూర్యం.

"ఈ ఆడవాళ్ళు!' అనుకున్నాడు మనసులోనే

కాక పట్టటం లేక కబుర్లు చెప్పటం పూర్తయ్యిందేమో-"వస్తానండీ అత్తయ్య గారూ! అంటూ లేచింది వెంకటలక్ష్మి

"మంచిదమ్మా! అమ్మగార్ని ఓమాటు రమ్మనమను-బొత్తిగా ఇటు తొంగి చూడ్డమే మానేశారావిడ' అంటోంది సూర్యం తల్లి

'హమ్మయ్యా!' అనుకున్నాడు సూర్యం

వెంకటలక్ష్మి వెళ్ళిపోయినట్లు క్రమంగా దగ్గరయి దూరమైన ఆమె కాలి పట్టాల శబ్దమే చెప్పింది

సూర్యం లేచి వెళ్ళి వంటింటి గడప మీద కూర్చున్నాడు

"ఆకలేస్తోందా? అరటికాయ కూరలో పోపు పెట్టి పెట్టేస్తాను-నీళ్ళోసుకొన్నావా? అడిగింది తల్లి

'ఊఁ! నాకా అరటికాయ కూరవద్దు! విన్ననే పోసేసుకున్నాను అన్నాడు సూర్యం

చివర మాట అర్థం కానట్లు చూసిం దావిడ

'అవును కాని అమ్మా! ఆ కరణంగారి పిల్లకి బొత్తిగా పనీ పాటా లేదా? ఊరంతా తిరుగుతూంటుంది గజ్జల గుఱ్ఱంలా-

ఆ పిల్ల సంగతి నీకెందు కన్నట్లు చూసిందావిడ

రక్కున మాట మార్చేశాడు సూర్యం

"సరే-అన్నం పెట్టు అవతల అర్జంటు పనుంది' అన్నాడు లేస్తూ

ఆవిడేం మాట్లాడలేదు

'హమ్మ వెంకటలక్ష్మీ! అమ్మ నీ బాగానే కాకా పట్టావే- అనుకున్నాడు.

మళ్ళీ గదిలో చేరాడు

'వేపచెట్టు కొట్టేయ్యించింది!

"ఊరి ఆడపిల్లలందరూ తనతో మాట్లాడకుండా చేసింది!

"అమ్మ మనసుని ఆకట్టేసుకుంది!

సూర్యం వరుసగా మధనపడిపోయాడు వెంకటలక్ష్మి ఎందుకివన్నీ చేస్తోంది? దీని వలన ఆ అమ్మాయికి ఒరిగే దేమిటి? తను నన్ను పబ్లిగ్గా దుమ్మెత్తి పోస్తూ- తనంటే నేను మండిపడతానని అమ్మదగ్గర కొత్త పాట పాడుతుందా?

పాడు గుణం

బాబుగాడు అన్నట్లు ఇదేదో వింత రకం సైకాలజీలాగే అనిపించింది సూర్యానికి

దీనికి సమాధానం ఆతగాడే చెప్పాలని పించింది అందుకే వెంటనే కలం కాగితం తీసుకుని- వివరంగా తన సందేహాలు వ్యక్తం చేశాడు బాబురావుకి

వెంటనే జవాబు వచ్చింది

సూరీ

వెంటనే వెంకటలక్ష్మిని పెళ్ళిచేసుకో- ఆ అమ్మాయే విప్పుతుంది ఆ తర్వాత చిక్కు ముడులన్నీ

—బాబురావు

సమాధానం చదివి క్షణం సేపు ఆలో చన్లో పడ్డాడు సూర్యం 'వెంకట లక్ష్మినా? అనుకున్నాడు కాసేపు పోయాక 'వెంకటలక్ష్మికేం! అను కున్నాడు

వెంకటలక్ష్మి రూపాన్ని స్మృతికి



తెచ్చుకన్నాడు

బాగానే ఉంటుందనుకున్నాడా పైన

అంతే! ఓ నాటి ఉదయాన్న తల్లి తులసికోటకి పూజచేసుకుంటున్నప్పుడు ప్రక్కనే వెళ్ళి నుంచుని ప్రసాదం అడిగాడు

తర్వాత మెల్లిగా 'అమ్మా! ఇదే- అంటూ మనసులో మాట వెల్లడించాడు

తల్లి పొంగిపోయిందా మాటలు వింటూ

ఎందుకంటే ఆవిడ మనసులో అంతర్గతంగా ఉన్న కోరికే కనుక ఉది ఆ మధ్యాహ్నం శంకర మఠంలో పురాణ కాలక్షేపానికి వెళ్లి వెంకటలక్ష్మి తల్లితో అంతా చెప్పి- ఏమంటావ్ వదినా?' అంది

కోరి పిల్లనడిగితే కాదనే మూర్ఖురాలు కాదావిడ

* * *

"మా వేపచెట్టుమీద దయ్యం నిజంగానే ఉండేదా?-వెంకటలక్ష్మి' అనడిగాడు సూర్యం మొదటి రాత్రి వెంకటలక్ష్మిని

ఆ మాటలు వింటూ పక్కుమని నవ్వింది వెంకటలక్ష్మి

'ఎందుకు వరినే నవ్వుతావ్? అన్నాడు

మళ్ళీ నవ్వింది అందంగా-హాయిగా

"చెప్పు వెంకటలక్ష్మీ! నీ కెప్పుడైనా కనిపించిందా

"ఊఁ చాలాసార్లు కనిపించింది వలపు దయ్యం!' అంది

"వలపు దయ్యమా? ఆశ్చర్య పోయాడు

'అవును-ఊళ్లో ఆడపల్లలందరూ మీ ఇంటి కొచ్చేది వేపపూతకోసం అను కున్నారా? అదేంకాదు; మీ కంట్లో పడ్డా నికి ఆపైన ఇంట్లో పడ్డానికి అదీకాక బొత్తిగా బుద్ధిమంతులని మీకో పేరు కూడా ఉందాయె

ఏ ఆడపిల్లకైనా ఆ మాత్రం ఆశ ఉంటుంది అందుకే ఆ వలపు దయ్యం వదల్చటానికే మీ వేపచెట్టుమీద దయ్యాన్ని ఎక్కించాను- అంటూ చెప్పటం ముగిం చింది

"వెంకటలక్ష్మీ!" అన్నాడు సూర్యం ఆశ్చర్యంగా ఆనందంగా 'అవును-మన సైనా మీరు పరో ఆడపల్ల పాటపాడు తూంటే చూస్తో ఎలా ఊరుకోగల్ను? అయినా నాదే తప్పు మగాడి మనసు ఎలా ఆకట్టుకోవాలో తెలియక పోవటమే నాకింత అనర్థం తెచ్చి పెట్టింది తనకుగా తాను వస్తే చులకన అవుతుందంటారు ఆడది అందుకనే చీదరించుకోవటం మొదలు పెట్టాను చీదరించుకున్న కొద్దీ చేరువవు తారనుకున్నాను గాని దూరమవుతారనుకో లేదు నా ద్వేషాన్ని-ద్వేషంగానే చూశారు గాని అందులో ప్రేమ ఉందని మీరూ తెలుసుకోలేకపోయారు అందుకే కంగారు పడ్డాను వేపచెట్టు కొట్టించేలా చేస్తే అందుకోసం వచ్చే ఆడపిల్లలు మీ ఇంటి ఛాయలకి రాకుండా ఉంటారని లేని దయ్యాన్ని సృష్టించాను అలాగే జరిగింది అయితే కథ అంతటితో ముగిసిపోలేదు నలుగు రాడపిల్లలు కలిసిన చోట మీ బుద్ధి మంతతనం గురించే వచ్చేది, అవే కబుర్లూ అవే మాటలు అందుకనే మిమ్మల్ని వాళ్ళ దృష్టిలో రౌడీసీ-రాలుగాయిని చేశాను అంతే-వాళ్లింక మీ పేరెత్తితే ఒట్టు!' పెద్ద పెట్టున ఉపన్యాసం దంచింది వెంకట లక్ష్మి

జెలసీ అసూయ!' సూర్యం అను కున్నాడు వెంకటలక్ష్మి చెప్పినదంతావిని

అయినా వెంటనే తేరుకుని తనకోసం ఓ ఆడపిల్ల పోటీపడి జెలసీ చూపించటం కూడా క్రెడిట్‌గానే భావించాడు ఆ భావ నలో సూర్యానికి వెంకటలక్ష్మి మీద ప్రేమ అధికం అయ్యింది

"వెంకటలక్ష్మీ!' అన్నాడు ఆప్యా యంగా ఆమె చేయి అందుకుని

"మిరు నన్ను క్షమిస్తారా?-" అమాయకంగా అడిగింది

"ఎందుకూ-? అన్నాడు సూర్యం

"మీ వేపచెట్టుని అనవసరంగా కొట్టిం చేసినందుకు-'

సూర్యం నవ్వాడు

"క్షమించను ప్రేమిస్తాను ఎందుకో తెల్సా? వేపచెట్టు వెనుక ఇంత వలపు గుట్టు ఉన్నందుకు అది కొట్టేయ్యటంతో అంతా బయటపడినందుకు

తర్వాత మనసులో అనుకున్నాడు-

'ఓరేయి బాబూ నీ సైకాలజీ అద్భుతం నువ్వే నెగ్గావ్

అన్నమాట ప్రకారం ఇక పైన నీ పేంట్లు అడగను-ఎందుకో తెల్సా? నువ్వు నెగ్గినందుకు కాదు నా పెళ్ళికి దజను పేంట్లు కుట్టించుకున్నాను గా? అందుకు"

★